నిధులున్నా నిర్లక్ష్యమేల?

- ఈ-టాయిలెట్ల ఏర్పాటులో జాప్యం
- కౌన్సిల్ తీర్మానం జరిగి 15 నెలలు గడిచినా పట్టించుకోని అధికారులు

గుంతకల్లుటౌన్: పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గుంతకల్లుగా తీర్చిదిద్దే క్రమంలో ప్రజల సౌకర్యార్థం నిత్యం జనరద్దీ కలిగిన ప్రాంతాల్లో అత్యాధునిక మూత్రశాలలు, మరుగుదొడ్ల (ఈ-టాయిలెట్ల)ను ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసి 15 నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆధునిక పరిజ్ఞానంతో పనిచేసే వీటి ని పైలట్ ప్రాజెక్టు కింద పలు ఏరియాల్లో ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ రూ.20 లక్షల మంజూరు చేసింది. ఈ తీర్మానాలు కాగితాలకే పరిమితమయ్యాయే తప్ప ఆచరణకు నోచుకోవడంలేదు.

చైర్‌పర్సన్ చొరవ..

రైల్వే డివిజన్ కేంద్రమైన గుంతకల్లులో సుమారు లక్షన్నర జనాభా ఉంది. పట్టణానికి వివిధ పనులు, వ్యాపారాలు, సరుకుల కొనుగోళ్ల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో జనం వస్తూ పోతూ ఉంటారు. ప్రత్యేకించి మహిళలు తమ కాలకృత్యాలు తీర్చుకోవాలంటే నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. మహిళల ఇబ్బందుల దృష్ట్యా ప్రధాన రహదారుల్లో బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని గతేడాది ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వై.నైరుతిరెడ్డి కోరారు. దీంతో అధికార యంత్రాంగం స్పందించింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నియమ నిబంధనలు ప్రకారం పట్టణంలో మున్సిపల్ స్థలం, నీటి సౌకర్యం తదితర వసతులు కలిగిన పాతబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, 60 అడుగుల రోడ్, మెయిన్‌రోడ్లలోని పలు ఏరియాలను అప్పటి కమిషనర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. నీటి సరఫరా దగ్గర నుంచి విద్యుత్ వాడకం వరకు సెన్సార్‌ల ద్వారా పని చేయడం అధునాతన మూత్రశాలల ప్రత్యేకత అని అధికారులు చెప్పారు. టిష్యూ పేపర్లు వాడిన తరువాత అంతర్గతంగా ఆమ్లరసాయన ప్రక్రియతో పూర్తిగా కాలిపోయేలా ఏర్పాట్లు చేయనున్నామన్నారు. చుట్టుపక్కల దుర్వాసన కూడా లేకుండా పరిసరాలు శుభ్రంగా ఉండేలా వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారు. కానీ నేటికీ ఈ-టాయిలెట్ల ఏర్పాటుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు ఈ-టాయిలెట్లను ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


అధికారులు ప్రతిపాదించిన ఆటోమేటెడ్ ఈ-టాయిలెట్ మోడల్

ఈ-టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం



పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ-టాయిలెట్ల ఏర్పాటు చేస్తాం. కౌన్సిల్ తీర్మానాన్ని పరిశీలించాక ఈ-టాయిలెట్ల ఏర్పాటు, దాని నిర్వహణ బాధ్యతను సదరు సంస్థకు అప్పగించడమా లేక ఓడీఎఫ్(బహిరంగ మల,మూత్ర విసర్జన రహిత) పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేయడమా అనే అంశాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి తదుపరి చర్యలు చేపడుతాం.

– వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, గుంతకల్లు

క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో జల ప్రసాద కేంద్రం ఏర్పాటు


జలప్రసాద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి మంజుల

గుంతకల్లు రూరల్: కాలిఫోర్నియాకు చెందిన దాతలు బొల్లి ముంత భార్గవ్ కుమార్ సహకారంతో మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత జల ప్రసాద కేంద్రం(వాటర్ ప్లాంట్) ఏర్పాటు చేశారు. గుంతకల్లు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి జీ.మంజుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన బొల్లి ముంత వెంకటనారాయణ దేవదాయశాఖ ఉరవకొండ ఈఈ లలిత, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నతస్థానాలు అధిరోహించండి


జగనన్న ఆణిముత్యాలు అవార్డు గ్రహీతలతో అతిథులు

గుత్తి: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని కౌన్సిలర్ నజీర్ అహ్మద్, హెచ్‌ఎం సుబహాన్, సీనియర్ ఉపాధ్యాయుడు దేశాయి నాగరాజు విద్యార్థులకు సూచించారు. స్థానిక కోటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు మంగళవారం జగనన్న ఆణిముత్యాలు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం


జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో మంగళవారం జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో చౌడేశ్వరిదేవి ఆలయం ప్రారంభించి 41 రోజులు పూర్తి కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి చెక్క భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున జ్యోతులతో గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎంఈఓ-2గా మనోహర్ బాధ్యతల స్వీకరణ



గుత్తి రూరల్: గుత్తి నూతన ఎంఈఓ-2గా మనోహర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యల్లనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న మనోహర్‌ను గుత్తి ఎంఈఓ-2గా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎంఈఓ మండల పరిషత్ కార్యాలయంలో గుత్తి ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖ పరమైన సమస్యల పరిష్కారానికి ఎంఈఓ రవినాయక్‌తో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు.

గుంతలు పూడ్పించిన పోలీసులు


గుంతలు పూడ్చివేయిస్తున్న పోలీసులు

గుత్తి రూరల్: గుత్తి-గుంతకల్లు మార్గంలో 67వ నంబర్ జాతీయ రహదారిపై పోలీసులు మట్టితో గుంతలు పూడ్చారు. వివరాల్లోకెళితే.. గుత్తి-గుంతకల్లు మార్గంలో నూతన వంతెనలు నిర్మించే చోట రోడ్డు ధ్వంసమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డుపై మోకాళ్ల లోతు గుంతలతో కంకర రాళ్లు తేలి లారీలు వేగంగా వెళ్తూ టైర్ల కింద పడిన రాళ్లు తగిలి అనేక మంది గాయపడుతున్నారు. దీంతో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి స్పందించారు. గుత్తి-గుంతకల్లు మార్గంలో కొజ్జేపల్లి, రజాపురం వద్ద మంగళవారం ఉదయం నుంచి సుమారు రెండు టిప్పర్లు, మూడు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి గుంతలు ఉన్న రోడ్లపై మట్టి వేయించారు. గుత్తి పోలీసులు గుంతలు పూడ్చడంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుత్తి నుంచి గుంతకల్లుకు వెళ్లాలంటే గుంతల మార్గంలో వెళ్లలేక వాహనాలు పాడవుతున్నాయని జాతీయ రహదారుల అధికారులు స్పందించి గుంతకల్లు రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

కుష్టుపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన


ఆశావర్కర్లకు సర్వే లిస్టు అందిస్తున్న వైద్యుడు శివసాయి

యల్లనూరు: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం కుష్టుపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శివసాయి కుష్టు లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈనెల 26 నుంచి జూలై 16 వరకు ఇంటింటా తిరిగి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్‌ఎం శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: కుష్టు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు కుష్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీ ని గుర్తించాలో తెలియజేశారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కుష్టు బాధితుల వివరాలను సేకరించాలని సూచించారు.

గార్లదిన్నె: కుష్టు సర్వే పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారి షమీన్‌తాజ్ సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం కుష్టు సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి సర్వే ఎలా చేయాలో తెలియజేశారు. డాక్టర్ హానీ షా, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, పీహెచ్‌ఎన్ అరుణకుమారి, సూపర్‌వైజర్ కృష్ణమోహన్, విశ్వనాథ్‌రావు, సూర్యకళ, ఇందిరమ్మ, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలను సీజ్ చేయండి


ఎంఈఓతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తూ అనేక రకాల ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రంగస్వామి, వైఎస్సార్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు వంశీయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణ స్కూల్‌లో పుస్తకాల విక్రయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేయడంతో ఆయన అక్కడికి చేరుకుని సంజాయిషీ కోరారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో దోపిడీని అరికట్టకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు భరత్,ప్రసాద్, తరుణ్, శంకర్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులు ప్రారంభించండి


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: మండలవ్యాప్తంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ పండ్లతోటల పెంపకం పనులు ప్రారంభించాలని ఏపీడీ వెంకటరత్నం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకున్న రైతులతో గుంతలు తీసే పనులు ప్రారంభింపజేయాలన్నారు. అంకుముందు ఆయన బుక్కాపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఏపీడీ అసిస్టెంట్ నరేంద్ర, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, ఆదిల్, శ్రీనివాసులు, శంకర్, జయరాం పాల్గొన్నారు.

పల్లెల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

యల్లనూరు: పల్లెల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన వెన్నపూసపల్లిలో పెద్దమ్మ గుడి వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చిన్నచిన్న సమస్యలకు కొందరు రాజకీయ రంగు పూసి అలజడి చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

తాడిపత్రి: పట్టణంలోని సీబీ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలికి గాయాలయ్యాయి. బాధితురాలి వివరాల మేరకు.. వెంకటలక్ష్మమ్మ ఉదయం రామచంద్ర లాడ్జి వద్ద సీబీ రోడ్డుపై చెత్త ఊడ్చుతుండగా బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఘటనలో ఆమె చేయి విరిగింది. స్థానికులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెను అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రూపురేఖలు మార్చేశారని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. మంగళవారం సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఆణిముత్యాలు పురస్కారాలను ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారన్నారు. జగనన్న ఆణిముత్యాల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. అనంతరం గురుకుల పాఠశాల, గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ తనిఖీ చేశారు. సర్పంచ్ అప్పా వెంకటేష్, ప్రిన్స్‌పాల్ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ సునీత పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ సునీత అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అంతకుముందు ఆమె రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి స్వాతి లక్ష్మి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు కొండమ్మ, పసులూరు సర్పంచ్ కల్పన, డీటీ ప్రతాప్‌రెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, సీహెచ్‌ఓ మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్యపరీక్షలు

తాడిపత్రి: ఇగుడూరు గ్రామంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 64 మందికి పరీక్షలు నిర్వహించి 11 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు డివిజన్ జిల్లా పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ మధుసూదనరాజు తెలిపారు. వీరికి ఈ నెల 22, 26, 27, 28 తేదీల్లో అనంతపురంలోని శారదా నగర్‌లో ఉన్న సంచార నేత్ర వైద్యశాలలో కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. చుక్కలూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి లావణ్య కుమారి, సర్పంచు పోలు రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై ర్యాలీ

పామిడి: అంతర్జాతీయ యోగా దినోత్సవంపై ఆయూష్ ప్రభుత్వ వైద్యాధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎద్దులపల్లిరోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా వక్తలు యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా ట్రైనర్ ఎస్ సంధ్యదత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు చెట్టు దగ్ధం



యాడికి: బోయరెడ్డిపల్లె సమీపంలోని పెన్నా కర్మాగారం వద్ద ఉన్న నగేశ్వర రెడ్డి హోటల్ వద్ద మంగళవారం రాత్రి పిడుగుపడటంతో చెట్టు కాలిపోయింది. చెట్టుపై పిడుగు పడిన సమయంలో పరిసరాల్లో జనాలు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి


మస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాన్ పీహెచ్ వర్కర్ల మస్టర్‌ను కమిషనర్, ఎంఈ ఈశ్వరయ్య పరిశీలించారు. టర్న్‌కాక్‌లు వారికి కేటాయించిన వార్డుల్లో తిరుగుతూ నీటి సమస్యలుంటే వెంటనే స్పందించాలన్నారు. నీరు వృథా చేయవద్దని ప్రజలకు తెలియజేయాలన్నారు. అంతకుముందు కమిషనర్ సోఫియాస్ట్రీట్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్తసేకరణ సరిగ్గా జరుగుతుందా?లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట తొలగింపు


పత్తి పంటను ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు నాగమునిరెడ్డి

యాడికి: బోరుబావి కింద సాగు చేసిన 4 ఎకరాల పత్తి పంట ఏపుగా ఎదుగుదల లేకపోవడంతో దిక్కుతోచని ఓ రైతు తొలగించాడు. వివరాలు.. కేశవరాయుని పేటకు చెందిన నాగమునిరెడ్డి రాయలచెరువు గ్రామంలో ఓ వ్యాపారి వద్ద ధర్మగోల్డ్ రకం పత్తి విత్తనాలు తీసుకొని కేశవరాయునిపేట గ్రామ సమీపంలోని తన వ్యవసాయ బోరుబావి వద్ద 4 ఎకరాల్లో గత ఏప్రిల్‌లో పత్తి పంటను సాగు చేశాడు. విత్తనం వేసి రెండు నెలలు కావొస్తున్నా మొక్కల ఎదుగుదల లేక ఆకులు ఎర్రగా మారుటంతో పాటు ఎండిపోతున్నాయి. మొక్కల ఎదుగుదలకు సూక్ష్మపోషకాల మందును కూడా పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో చేసేదేమి లేక రైతు మంగళవారం ట్రాక్టర్‌తో పంటను దున్నేశాడు. పత్తి విత్తనాల పెట్టుబడి, కూలీలు, సేద్యం ఖర్చు, మందులు దాదాపు రూ.40 వేల దాకా నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకుముందు ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మహబూబ్‌బాషా పంటను పరిశీలించారు. రైతుతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

బైక్ స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్

పామిడి: పట్టణంలోని హైవేపై రామకుమార్ లెనిన్‌క్లబ్(వస్త్ర దుకాణం) వద్ద మంగళవారం దారిదోపిడీలు దొంగలు వదిలేసి పారిపోయిన బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి అందించిన వివరాలు.. శింగనమల మండలం లోలూరు క్రాస్ హైవే వద్ద ఆగి ఉన్న లారీలో నుంచి ఒక సెల్‌ఫోన్‌ను ముగ్గురు గుర్తు తెలియని దొంగలు దొంగలించారు. లారీ డ్రైవర్ రాజు, క్లీనర్ శీను గమనించడంతో వారు బైక్‌పై పామిడి వైపుకు బయలుదేరారు. దీంతో వారు దొంగల బైక్‌ను వెంబడించారు. స్థానిక లెనిన్ క్లబ్ వద్దకు రాగానే దొంగలు బైక్‌ను వదిలేసి పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ల్యాప్‌టాప్ అప్పగింత


ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

పెద్దవడుగూరు : వాహనంలో మరచిపోయిన ల్యాప్‌టాప్‌ను పోలీసులు బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వివరాలు.. కర్నూలుకు చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తి వెల్దుర్తిలోని ఒక ప్రయివేటు పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులకు హాజరు కావడం కోసం ప్రయివేటు వాహనంలో బయలుదేరాడు. ఈక్రమంలో తన వెంట తెచ్చుకున్న ల్యాప్‌టాప్‌ను వాహనంలోనే మరిచిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన పెద్దవడుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కాశేపల్లి టోల్‌గేట్ వద్ద సదరు వాహనంలో ఉన్న ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని 22వ వార్డు(ఓల్డ్ సీపీఐ కాలనీ)లో సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని వారు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే 15వ వార్డు(చర్చి రోడ్డు)లో కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. వారం రోజుల్లో కల్వర్ట్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్లు సులోచన, అంజల, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, షఫి, వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడికి రైల్వే జీఎం ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే జీఎంతో పాటు డీఆర్‌ఎం కే.వెంకటరమణారెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నేరుగా స్వామి సన్నిధికి తీసుకెళ్లి వారి కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు జరిపారు. అనంతరం స్వామి ప్రసాదం, నెట్టికంటి ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

గుత్తి రూరల్: గాజులపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గంగమ్మ అనే మహిళను మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. గంగమ్మ ఇంట్లో దాచిన 22 టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

యాడికి: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. రాయలచెరువులోని చందన గేట్ వదనున్న చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్‌పై తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేశారు.

ఎంఈఓ-2గా సత్యనారాయణ

పామిడి: పామిడి ఎంఈఓ-2గా జీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు బీవీ రమణ, సుంకప్ప, మల్లికార్జున, సతీష్, సలీమ్‌బాషా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

గార్లదిన్నె: గుడ్డాలపల్లి క్రాస్ సమీపంలో44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య,భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. మర్తాడుకు చెందిన భార్యాభర్తలు ఇందు,హరి బైక్‌పై పామిడికి బయలుదేరారు. గుడ్డాలపల్లి క్రాస్ వద్ద ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోండి

పెద్దపప్పూరు: సత్ప్రవర్తనతోపాటు అనుభవజ్ఞులైన వారిని డ్రైవర్లుగా నియమించుకోవాలని ఎస్ఐ ఖాజా హుస్సేన్ ప్రైవేటు పాఠశాలల యజమానులకు సూచించారు. మంగళవారం ఆయన తాడిపత్రి ఎంవీఐతో కలిసి మండలంలోని ప్రవేటు పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. పాఠశాలల నిర్వాహకులు, బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బస్సుల నిర్వహణ, డ్రైవర్ల పనితీరుపై అవగాహన కల్పించారు.

పొలం తగదా కేసులో ఐదుగురికి జరిమానా

శింగనమల: పొలం తగాదా కేసులో ఎక్సైజ్ కోర్టు ఐదుగురికి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎస్ఐ బాలకృష్ణయ్య వివరాల మేరకు...రఘునాథపురంలో 2015లో పొలం విషయంపై జే. జనార్ధనరెడ్డి, జే.సుదర్శన రెడ్డి వర్గీయులు ఘర్షణపడ్డారు. అప్పట్లో జే. జనార్ధనరెడ్డి ఫిర్యాదు మేరకు జే. సుదర్శనరెడ్డి, మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి ఓంకార్ జే.సుదర్శనరెడ్డి, హరినాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రఘునాథరెడ్డి, తిరుపాలు రెడ్డికి రూ.వేయి చొప్పున జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్స్ తరపున ఏపీపీ ఎల్మాస్ బాను వాదించారు.

రహదారులపై హెచ్చరిక బోర్డులు

శింగనమల: మండలంలోని లోలూరు క్రాస్, శింగనమల క్రాస్ వద్ద తాడిపత్రి-అనంతపురం రహదారిపై ప్రమాదాలు జరిగే చోట మంగళవారంహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సీఐ అస్రార్‌బాషా తెలిపారు. సీఐ అస్రార్ బాషా మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అతి వేగం ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఎస్ఐ బాలక్రిష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846